26–5–26 rakshana main_Layout 1 6/13/2026 12:31 AM Page 1







APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

గుంటూరు | సంపుటి -1 | సంచిక -97 | పేజీలు-4 | శనివారం 13 జూన్ 2026 | వెల4/-


## కన్యాకుమారి నుంచి కశ్మీర్‌కు.. ఐటీ ఉద్యోగి పాదయాత్ర



పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఓ ఐటీ ఉద్యోగి చేపట్టిన పాదయాత్ర అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు వేల కిలోమీటర్లు నడుస్తూ ప్రకృతి సంరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

02

## జగన్ కు చంద్రబాబు

# సవాల్...





- తిరుపతి వేదికగా కూటమి శక్తి ప్రదర్శన...
- రెండేళ్ల పాలనపై చంద్రబాబు మార్క్ నివేదిక
- మోదీ అండతోనే ఏపీ పునర్నిర్మాణం: సీఎం
- వైసీపీపై విమర్శలు.. అభివృద్ధిపై ఫోకస్
- 2029 లక్ష్యంగా కూటమి శ్రేణులకు దిశానిర్దేశం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరు పతిలో నిర్వహించిన ఎన్డీఏ విజయోత్సవ సభ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ తదితరులు పాల్గొన్న ఈ సభలో ప్రభుత్వ విజయాలు, కేంద్ర సహ కారం, భవిష్యత్ అభివృద్ధి ప్రణా ళికలు ప్రధానాం శాలుగా నిలిచాయి. ఇదే సమయంలో గత ప్రభుత్వంపై తీవ్ర విమ ర్శలు చేస్తూ కూటమి నేతలు రాజకీ య సందేశాన్ని స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు.

వివరాలు 2వ పేజీలో

### జగన్‌పై చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు..

“అప్పులు చేసి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన వారికి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదు. ఎమ్మార్వో కార్యాలయాలు, ఆస్పత్రులు, మద్యం ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేయాలని చూశారు. అలాంటి వారు ఇప్పుడు రాష్ట్ర భవిష్యత్తుపై మాట్లాడటం విడ్డూరం” అని సీఎం చంద్రబాబు విమర్శించారు

# ప్రజలే సుప్రీం..

- 2024 తీర్పు అధికార గర్వానికి గుణపాఠం
- ప్రజలు ఇచ్చింది అధికారం కాదు.. బాధ్యత: పవన్ కళ్యాణ్
- గ్రామసభల బలోపేతంతోనే ప్రజాస్వామ్యానికి బలం
- వ్యవస్థలపై నమ్మకాన్ని పునరుద్ధరించడమే కూటమి లక్ష్యం



వివరాలు 2వ పేజీలో

ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం అని, 2024 ఎన్నికల తీ ర్పు అధికార అహంకారానికి ప్రజలు నేర్పిన గుణపాఠమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజలు కూ టమికి ఇ చ్చింది అధికారం కాదని, రా ష్ట్రా న్ని కాపాడి అభివృద్ధి పథంలో నడి పించే బాధ్యత అని స్పష్టం చేశా రు.

## కార్మిక సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం

- రెండేళ్లలో కార్మిక రంగంలో సమగ్ర సంస్కరణలు
- డిజిటల్ సేవలు, నైపుణ్యాభివృద్ధికి ఊతం
- పారిశ్రామిక భద్రతపై ప్రత్యేక దృష్టి



రాష్ట్రంలో కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య రక్షణ, పారిశ్రామిక భద్రతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్లు మరియు ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. గత రెండేళ్లలో కార్మిక రంగంలో చేపట్టిన సంస్కరణలు విశేష ఫలితాలను ఇచ్చాయని పేర్కొన్నారు.

02

## రెండేళ్లలో విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టాం

- రెండేళ్లుగా విద్యుత్ చార్జీల పెంపు లేదు
- ట్రూ-అప్‌కు బదులు ట్రూ-డౌన్ అమలు
- విద్యుత్ రంగంలో సంస్కరణలతో ముందడుగు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలో విద్యుత్ వ్యవస్థను పూర్తిగా గాడిలో పెట్టామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. గత రెండేళ్లలో ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదని, రానున్న మూడేళ్లలో కూడా ఎలాంటి భారం మోపబోమని స్పష్టం చేశారు.

02

## విమాన ప్రమాదంపై పూర్తి స్థాయి దర్యాప్తు

నిజాలు వెలుగులోకి వచ్చాకే కారణాలపై స్పష్టత: మంత్రి రామ్మోహన్ నాయుడు



ఎయిరిండియా విమాన దుర్ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపిందని, ప్రమాదానికి గల కారణాలను గుర్తించేందుకు సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. అన్ని సాంకేతిక అంశాలను పరిశీలించిన తర్వాతే ప్రమాదంపై స్పష్టమైన వివరాలు వెల్లడవుతాయని ఆయన పేర్కొన్నారు.

02

## డీఎస్సీపై తప్పుడు ప్రచారం వద్దు..

మంత్రి లోకేష్....

- ఉపాధ్యాయ నియామకాలపై ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మంత్రి
- ఖాళీల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని వెల్లడి
- యువతకు న్యాయం చేయడమే లక్ష్యమని స్పష్టం



డీఎస్సీ నియామకాలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని, తప్పుడు ప్రచారాలతో యువతను అయోమయానికి గురిచేయొద్దని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందని, నిరుద్యోగులకు న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు

02

# కార్మిక సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి

అమరావతి, (రక్షణ ప్రతినిధి):

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని సామాజిక బాధ్యతగా భావించి పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. శుక్రవారం సచివాలయం ప్రచార విభాగంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక సంక్షేమం, నిర్మాణ కార్మికుల భద్రత, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ సేవలు, ఇఎస్ఐ వైద్య సేవలు, పారిశ్రామిక భద్రత తదితర అంశాలపై గత రెండేళ్లలో సాధించిన పురోగతిని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో కార్మిక సంక్షేమ వ్యవస్థ నిర్వీర్యమైందని, నిర్మాణ కార్మికుల నిధులు సక్రమంగా వినియోగం కాలేదని మంత్రి విమర్శించారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిచిపోయిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంతో పాటు కార్మికులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల కోసం వివాహ బహుమతి, ప్రసూతి ప్రయోజనం, మరణ సహాయం, అంత్యక్రియల ఖర్చుల వంటి పథకాలను మళ్లీ అమలు చేస్తున్నామని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 25 ఇంటిగ్రేటెడ్ లేబర్ అమినిటీస్ కాంప్లెక్సుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఉపాధి సమాచారం, వై-ఫై, త్రాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, కార్మికుల నమోదు, నైపుణ్యాభివృద్ధి సేవలు ఒకే చోట అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. భవిష్యత్తులో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈ సౌకర్యాలను విస్తరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. కార్మిక శాఖ సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేసినట్లు మంత్రి తెలిపారు. ట్రేడ్ యూనియన్ నమోదు, కార్మికుల ఫిర్యాదులు, సంక్షేమ పథకాల క్లెయిమ్స్, బాల కార్మికుల పర్యవేక్షణ తదితర సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇంటి వద్ద నుంచే సేవలు పొందే అవకాశం కల్పించామని వెల్లడించారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు ఇ-శ్రమ్ పోర్టల్‌లో 88.67 లక్షల మంది నమోదు అయ్యారని మంత్రి తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో 18.26 లక్షల మంది నమోదు అయ్యారని చెప్పారు. రాష్ట్రంలో సమగ్ర కార్మిక డేటాబేస్‌ను రూపొందించి భవిష్యత్ సంక్షేమ పథకాలకు పునాది వేసినట్లు పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి వివరించారు. గతంలో నిలిచిపోయిన శిక్షణ కార్యక్రమాలను పునరుద్ధరించి 85 వేల మందికి శిక్షణ అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి అవకాశాలు, సర్టిఫికేషన్ కార్యక్రమాల ద్వారా యువతను పరిశ్రమలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పారిశ్రామిక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' కింద పలు సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. మహిళలకు భద్రత ప్రమాణాలతో రాత్రి షిఫ్ట్‌లలో పనిచేసే అవకాశం, 24 గంటల కార్యకలాపాలకు అనుమతులు, దుకాణాలకు జీవితకాల నమోదు వంటి నిర్ణయాలు పరిశ్రమల అభివృద్ధికి దోహదపడుతున్నాయని చెప్పారు. కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ ఇఎస్ఐ సేవల విస్తరణపై వివరించారు. ప్రస్తుతం 15.32 లక్షల మంది బీమా వ్యక్తులు, దాదాపు 60 లక్షల మంది లబ్ధిదారులకు వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. తిరుపతి ఇఎస్ఐ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడం, కొత్త డిస్పెన్సరీలు ఏర్పాటు చేయడం, విశాఖపట్నం, అమరావతిలో ఇఎస్ఐ మెడికల్ కాలేజీల స్థాపనకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పారిశ్రామిక భద్రత విషయంలో 'జీరో యాక్సిడెంట్స్' లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. సేఫ్టీ ఆడిట్లు, మాక్ డ్రిల్స్, భద్రతా అధికారుల శిక్షణ, డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థల ద్వారా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఈ చర్యల ఫలితంగా పారిశ్రామిక ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడిదారుల విశ్వాసం అనే మూడు లక్ష్యాలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. సమావేశంలో కార్మిక శాఖ కార్యదర్శి శేషగిరి బాబు, కమిషనర్ గంధం చంద్రుడు, ఫ్యాక్టరీల డైరెక్టర్ మోహనరావు, ఐఎంఎస్ డైరెక్టర్ ఆంజనేయులు తదితర అధికారులు పాల్గొన్నారు.

# విమాన ప్రమాదంపై పూర్తి స్థాయి దర్యాప్తు

మొదటి పేజీ తరువాయి

అమరావతి రక్షణ న్యూస్

ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనపై కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో వ్యవహరిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సంబంధిత విభాగాలు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టాయని ఆయన వెల్లడించారు. ఘటనకు గల అసలు కారణాలను గుర్తించేందుకు నిపుణుల బృందాలు పని చేస్తున్నాయని చెప్పారు. విమాన ప్రమాదాల దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్నాయని, విమానం సాంకేతిక పరిస్థితులు, వాతావరణ పరిస్థితులు, నిర్వహణ విధానాలు తదితర అంశాలపై సమగ్రంగా విచారణ జరుగుతోందన్నారు. ప్రమాదానికి సంబంధించిన బ్లాక్‌బాక్స్, ఫ్లైట్ డేటా రికార్డర్, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌ల నుంచి సమాచారం సేకరించి విశ్లేషిస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తు పూర్తికాకముందే ఎలాంటి ఊహాగానాలకు తావివ్వడం సరైంది కాదని మంత్రి స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాతే ప్రమాదానికి కారణమైన అంశాలపై అధికారిక ప్రకటన చేస్తామని చెప్పారు. అంతర్జాతీయ విమానయాన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా విచారణ జరుగుతోందని వివరించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ విషాద ఘటనపై ప్రధాని సహా కేంద్ర ప్రభుత్వం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోందన్నారు. దేశంలో విమాన భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన మార్పులు అమలు చేస్తామని చెప్పారు. ప్రమాదంపై పూర్తి నివేదిక వచ్చిన తర్వాత ప్రజలకు అన్ని వివరాలు వెల్లడిస్తామని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

# డీఎస్సీపై తప్పుడు ప్రచారం వద్దు..

అమరావతి: రక్షణ న్యూస్

రాష్ట్రంలో డీఎస్సీ నియామకాల అంశంపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించారు. ఉపాధ్యాయ నియామకాల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. డీఎస్సీపై కొందరు కావాలనే అపోహలు సృష్టిస్తున్నారని, వాటిని యువత నమ్మవద్దని సూచించారు.

డీఎస్సీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తగ్గించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గత కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి నాణ్యమైన ఉపాధ్యాయులు అవసరమని, అందుకే నియామకాల ప్రక్రియను వేగవంతం చేసినట్లు చెప్పారు. కొన్ని సంఘాలు, రాజకీయ పార్టీలు డీఎస్సీపై అనవసర సందేహాలు వ్యక్తం చేస్తున్నాయని లోకేష్ విమర్శించారు. ఖాళీల సంఖ్య, పోస్టుల కేటాయింపు, పరీక్షల నిర్వహణ వంటి అంశాలపై విద్యాశాఖ ఇప్పటికే స్పష్టమైన సమాచారం విడుదల చేసిందన్నారు. అయినప్పటికీ రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. అందుకే మెగా డీఎస్సీ నిర్వహణకు చర్యలు చేపట్టామని, అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతుందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు కోసం మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు ఉపాధ్యాయుల నియామకాలపై కూడా దృష్టి సారిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలంటే తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు ఉండాలని, అదే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అదే సమయంలో డీఎస్సీ అభ్యర్థులు పరీక్షలపై దృష్టి సారించాలని, వదంతులను పట్టించుకోవద్దని లోకేష్ సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే అన్ని కార్యక్రమాలు జరుగుతాయని, నియామకాల విషయంలో ఎలాంటి అన్యాయం జరగదని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను చారిత్రాత్మకంగా నిర్వహించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్న మంత్రి, విద్యారంగ అభివృద్ధి కోసం మరిన్ని సంస్కరణలు తీసుకురానున్నట్లు తెలిపారు. డీఎస్సీ అంశంపై లేవనెత్తిన ప్రతి సందేహానికి ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉందని, యువత ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు.

# జగన్ కు చంద్రబాబు సవాల్.

మొదటి పేజీ తరువాయి

తిరుపతి, రక్షణ బ్యూరో...

రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్న కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయోత్సవ సభ తిరుపతిలో ఘనంగా జరిగింది. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర పునర్నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, పరిశ్రమల రాక, ఉద్యోగాల కల్పన వంటి అంశాలను సభలో విస్తృతంగా ప్రస్తావించారు. రెండేళ్ల పాలనలో చేపట్టిన కార్యక్రమాలపై ప్రత్యేక వీడియో ప్రజెంటేషన్ నిర్వహించారు. వివిధ పథకాల లబ్ధిదారులను వేదికపైకి తీసుకువచ్చి ప్రభుత్వ పనితీరును ప్రజల ముందుంచారు. రాజకీయంగా కూడా ఈ సభకు ప్రత్యేక ప్రాధాన్యత నెలకొంది. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ కూటమి పాలనను ప్రజా ప్రభుత్వం అని నేతలు అభివర్ణించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనే మూడు ప్రధాన అజెండాలతో ప్రజల్లోకి వెళ్లాలన్న సంకేతాలను కూటమి నాయకత్వం ఈ సభ ద్వారా ఇచ్చినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**రెండేళ్ల పాలనకు ప్రజా ధృవీకరణే సభ లక్ష్యం...** కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఈ సభ కేవలం విజయోత్సవం మాత్రమే కాదని, ప్రజా విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం, పరిపాలనా వ్యవస్థల నిర్వీర్యం, పెట్టుబడుల కొరత వంటి సమస్యల మధ్య బాధ్యతలు చేపట్టామని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఎన్నికల్లో వచ్చిన విజయాన్ని అధికార ఆనందంగా కాకుండా రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతగా స్వీకరించామని చెప్పారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ సేవా దృక్పథంతో పాలన కొనసాగిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ పథకాల అమలు, ఉద్యోగ నియామకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడుల సాధన వంటి అంశాలను ప్రజల ముందుంచారు. సభలో ప్రదర్శించిన వీడియోలు కూడా ప్రభుత్వ పనితీరును అద్దం పట్టేలా రూపొందించబడ్డాయి. దీంతో ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాలన్న లక్ష్యం స్పష్టంగా కనిపించింది. రాజకీయంగా కూడా ఈ కార్యక్రమం కూటమి బలాన్ని ప్రదర్శించే వేదికగా మారింది.

**మోదీ సహకారమే రాష్ట్ర పురోగతికి బలం...** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా సహకరిస్తోందని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణం, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ వంటి కీలక అంశాల్లో కేంద్రం అండగా నిలిచిందన్నారు. దేశవ్యాప్తంగా మోదీ పాలనలో సాధించిన విజయాలను కూడా ఆయన వివరించారు. జాతీయ రహదారుల విస్తరణ, ఎయిర్‌పోర్టుల నిర్మాణం, చంద్రయాన్, గగన్ యాన్ వంటి అంతరిక్ష ప్రాజెక్టులు భారత ప్రతిష్ఠను పెంచాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి డబుల్ ఇంజన్ ప్రభుత్వ ప్రయోజనం లభిస్తోందని, అందువల్లే వేగవంతమైన అభివృద్ధి సాధ్యమైందని చెప్పారు. కేంద్రం-రాష్ట్రం సమన్వయంతో మరిన్ని పెట్టుబడులు, పారిశ్రామిక ప్రాజెక్టులు రాబోతున్నాయని వెల్లడించారు. రాజకీయంగా చూస్తే ఎన్డీఏ ఐక్యతను బలంగా చాటిచెప్పే సందేశాన్ని కూడా ఈ సభ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం కనిపించింది. రాబోయే ఎన్నికల్లో కూడా ఇదే కలయిక కొనసాగుతుందనే సంకేతాలను నాయకత్వం ఇచ్చింది.

**గత ప్రభుత్వంపై ఘాటు విమర్శలు...** సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, కేంద్ర పథకాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. పెట్టుబడిదారులను భయపెట్టి తరిమేశారని, యువత భవిష్యత్తును దెబ్బతీశారని విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను, ఆదాయ వనరులను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని ఆరోపించారు. ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా పరిపాలన సాగిందని, ప్రశ్నించిన వారిని వేధించారని పేర్కొన్నారు. రాజకీయంగా ప్రత్యర్థులపై దాడి చేయడమే కాకుండా తమ ప్రభుత్వ పనితీరును ప్రత్యామ్నాయంగా ప్రజలకు చూపించే వ్యూహాన్ని కూటమి అనుసరిస్తోందని ఈ వ్యాఖ్యలు స్పష్టం చేశాయి. సభ మొత్తం మీద గత ప్రభుత్వ వైఫల్యాలు, ప్రస్తుత ప్రభుత్వ విజయాలు అనే రెండు కోణాల చుట్టూనే చర్చ సాగింది.

**సంక్షేమం -- అభివృద్ధి ద్వంద్వ అజెండా...** కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వెనుకడుగు వేయలేదని సీఎం స్పష్టం చేశారు. ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం-2, అన్నదాత సుఖీభవ, మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో వంటి పథకాల అమలును వివరించారు. రైతులకు కేంద్రం సహకారంతో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. పెన్షన్లు, మహిళల సంక్షేమం, విద్య, వైద్యం, సామాజిక భద్రత వంటి రంగాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. అదే సమయంలో రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతూ అభివృద్ధి కార్యక్రమాలను కూడా వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి లేకుండా సంక్షేమం సాధ్యం కాదని, ఆదాయం పెంచినప్పుడే ప్రజలకు మరింత మేలు చేయగలమని సీఎం వ్యాఖ్యానించారు. రాజకీయంగా ఇది సంక్షేమాన్ని తమ బలంగా చెప్పుకుంటూనే అభివృద్ధిని ప్రధాన అజెండాగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంగా కనిపిస్తోంది.

**పెట్టుబడులు -- ఉద్యోగాలపై ఫోకస్...** రాష్ట్రంలో పారిశ్రామిక వాతావరణాన్ని పునరుద్ధరించామని, పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంచామని సీఎం వెల్లడించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నామని చెప్పారు. పుట్టపర్తిలో ఐదో తరం యుద్ధ విమాన ప్రాజెక్టుకు రికార్డు సమయంలో అనుమతులు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. రాయలసీమను హార్టీకల్చర్, స్పేస్, డ్రోన్, డిఫెన్స్ పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ పరిశ్రమ, విశాఖలో ఐటీ కంపెనీలు, అమరావతిలో క్వాంటం వ్యాలీ వంటి ప్రాజెక్టులను ఉదాహరణగా పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అవసరమైన నైపుణ్య శిక్షణను కూడా అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని రాజకీయంగా ప్రజల ముందుంచే ప్రయత్నంలో పెట్టుబడులు, ఉద్యోగాల అంశాన్ని కూటమి ప్రధాన ఆయుధంగా ఉపయోగిస్తున్నట్లు స్పష్టమైంది.

**2029 ఎన్నికల దిశగా కూటమి వ్యూహం...** తిరుపతి సభ రాజకీయంగా రాబోయే ఎన్నికలకు పునాది వేస్తున్న కార్యక్రమంగా కనిపించింది. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఒకే వేదికపై నిలబడి ఐక్యతను ప్రదర్శించారు. ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని పేర్కొంటూ మరింత బలమైన మద్దతు కోరారు. రాష్ట్ర పునర్నిర్మాణం, పెట్టుబడులు, సంక్షేమం, ఉపాధి కల్పన వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వంపై విమర్శలు కొనసాగిస్తూనే తమ పాలనను ప్రజలకు చేరువ చేయాలనే వ్యూహాన్ని స్పష్టంగా వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని చెప్పారు. మొత్తంగా తిరుపతి సభ కూటమి రెండేళ్ల పాలన సమీక్ష మాత్రమే కాకుండా భవిష్యత్ రాజకీయ కార్యాచరణకు సంకేతాలిచ్చిన కీలక వేదికగా నిలిచింది.

# ప్రజలే సుప్రీం..

మొదటి పేజీ తరువాయి

తిరుపతి, (రక్షణ బ్యూరో):

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం" విజయోత్సవ సభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక ప్రసంగం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి సభలో పాల్గొన్న ఆయన, ప్రజాస్వామ్యం, గ్రామ స్వరాజ్యం, స్థానిక సంస్థల బలోపేతం, వ్యవస్థలపై ప్రజల విశ్వాసం వంటి అంశాలపై విస్తృతంగా మాట్లాడారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఆ తీర్పు కేవలం ప్రభుత్వ మార్పు కాదని, అధికార అహంకారాన్ని ప్రజలు తిరస్కరించిన ప్రజాస్వామ్య విజయం అని అన్నారు. భయం, అహంకారం, అధికార దుర్వినియోగ రాజకీయాలకు ప్రజలు చెక్ పెట్టారని చెప్పారు. ప్రజలు కూటమికి అప్పగించింది అధికారం కాదని, రాష్ట్ర భవిష్యత్తును కాపాడే గొప్ప బాధ్యత అని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కొనియాడిన పవన్ కళ్యాణ్, మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్యం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్థానిక స్వపరిపాలన ఆలోచనలు, దీనదయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ సిద్ధాంతాల సమాహారమే మోదీ పాలన అని అన్నారు. "సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్" భావనతో దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలే ప్రజాస్వామ్యానికి పునాదులని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అధికారాన్ని కేంద్రీకరించడం ప్రజాస్వామ్యం కాదని, ప్రజల దగ్గరకు అధికారాన్ని తీసుకెళ్లడమే నిజమైన ప్రజాస్వామ్యమని చెప్పారు. స్థానిక సంస్థలను బలహీనపరిచి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయలేమని వ్యాఖ్యానించారు. గ్రామసభ బలపడితే పంచాయతీ బలపడుతుందని, పంచాయతీ బలపడితే ప్రజాస్వామ్యం మరింత పటిష్టమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలు తీవ్ర సంక్షోభంలోకి వెళ్లాయని ఆరోపించారు. బ్లీచింగ్ కొనుగోలు చేయడానికి కూడా నిధులు లేని పరిస్థితి ఏర్పడిందని, విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని, కేంద్ర నిధులు నిలిచిపోయాయని విమర్శించారు. గ్రామ స్థాయి పాలన బలహీనపడటంతో ప్రజల్లో వ్యవస్థలపై విశ్వాసం దెబ్బతిందన్నారు. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం నిర్మించింది కేవలం రోడ్లు, భవనాలు మాత్రమే కాదని, ప్రజల్లో వ్యవస్థలపై నమ్మకాన్ని పునరుద్ధరించిందని పవన్ కళ్యాణ్ అన్నారు. వ్యవస్థలపై విశ్వాసం తగ్గితే సమాజం కులాలు, ప్రాంతాలుగా విడిపోతుందని హెచ్చరించారు. తెలుగు రాష్ట్రాలు మరింత బలపడాలంటే కుల, ప్రాంతీయ పరిమితులను అధిగమించి భారతీయత వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. గ్రామ సమస్యలకు పరిష్కారం గ్రామాల్లోనే వెతకాలనే లక్ష్యంతో గ్రామసభలను ప్రజాస్వామ్య కేంద్రాలుగా మార్చామని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, గృహ అవసరాలపై నిర్ణయాలు ప్రజల సమక్షంలోనే తీసుకోవాలని చెప్పారు. ప్రజల అవసరాలు అధికారుల కంటే గ్రామస్తులకే బాగా తెలుసని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రజాస్వామ్య పాఠశాలగా అభివర్ణించిన పవన్ కళ్యాణ్, నాయకత్వం గ్రామ స్థాయి నుంచే రూపుదిద్దుకోవాలని అన్నారు. మహిళలు, యువత, వెనుకబడిన వర్గాల నుంచి నాయకత్వం ఎదగడానికి స్థానిక సంస్థలు కీలక వేదికలని చెప్పారు. గ్రామస్థాయిలో బలమైన నాయకత్వం పెరిగితే రాష్ట్ర అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. స్వర్ణ పంచాయతీ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో డిజిటల్ పరిపాలనకు శ్రీకారం చుట్టామని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆస్తుల నమోదు, ఆదాయ వనరుల గుర్తింపు, పారదర్శక పరిపాలన ద్వారా పంచాయతీల ఆర్థిక స్థితి మెరుగుపడుతోందన్నారు. తిరుపతి జిల్లా శ్రీనివాసపురం పంచాయతీ ఉదాహరణగా చూపుతూ, డిజిటలైజేషన్ వల్ల పంచాయతీ ఆదాయం రెట్టింపు స్థాయికి చేరిందని వివరించారు. వచ్చే ఎన్నికల కోసం కాకుండా, రాబోయే తరాల కోసం నిర్ణయాలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. గ్రామం బలపడితే ప్రజాస్వామ్యం బలపడుతుందని, ప్రజాస్వామ్యం బలపడితే దేశం బలపడుతుందని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ గ్రామం నుంచి దేశం వరకు బాధ్యతాయుత అభివృద్ధి యాత్రను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# రెండేళ్లలో విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టాం

మొదటి పేజీ తరువాయి

అమరావతి, (రక్షణ ప్రతినిధి):

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విడుదల చేసిన ప్రకటనలో విద్యుత్ రంగంలో సాధించిన పురోగతిని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యుత్ రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వినియోగదారులపై అదనపు భారం పడకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో విద్యుత్ వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని మంత్రి ఆరోపించారు. విద్యుత్ సంస్థలను ఆర్థికంగా బలహీనపరిచి వ్యవస్థ మనుగడకే ముప్పు తెచ్చిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగాన్ని పునర్వ్యవస్థీకరించి, రెండేళ్లలోనే గాడిలో పెట్టగలిగిందని తెలిపారు. గత రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదని మంత్రి స్పష్టం చేశారు. అంతేకాకుండా రానున్న మూడేళ్లలో కూడా విద్యుత్ చార్జీల పెంపు లేదా అదనపు భారాలు ఉండవని ప్రజలకు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారీ భారం మోపిందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ట్రూ-అప్ విధానాన్ని కూటమి ప్రభుత్వం ట్రూ-డౌన్‌గా మార్చిందని మంత్రి తెలిపారు. విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపకుండా 13 పైసల ట్రూ-డౌన్ అమలు చేసిన ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. ఇది విద్యుత్ రంగ చరిత్రలో కీలక నిర్ణయంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోళ్లపై ఆధారపడే పరిస్థితిని గణనీయంగా తగ్గించామని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సంప్రదాయేతర ఇంధన రంగంలో 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకం ద్వారా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఆరు లక్షల సోలార్ కనెక్షన్లు ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ట్రాన్స్‌మిషన్ నష్టాలను తగ్గించడం, విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.ో విద్యుత్ అంతరాయాలు, లో వోల్టేజ్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు దృష్టిలో పెట్టుకుని విద్యుత్ రంగాన్ని మరి ంత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, నాణ్యమైన విద్యుత్‌ను అందుబాటు ధరల్లో అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

# కన్యాకుమారి నుంచి కశ్మీర్‌కు.. ఐటీ ఉద్యోగి పాదయాత్ర

మొదటి పేజీ తరువాయి

అమరావతి రక్షణ న్యూస్...

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలనే లక్ష్యంతో ఓ ఐటీ ఉద్యోగి దేశవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దాదాపు 6,500 కిలోమీటర్ల దూరాన్ని కాలినడకన పూర్తి చేయాలని సంకల్పించారు. యాత్ర సందర్భంగా వివిధ రాష్ట్రాలు, పట్టణాలు, గ్రామాల గుండా ప్రయాణిస్తూ ప్రజలకు పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని వివరిస్తున్నారు. చెట్ల సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, నీటి వనరుల పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నారు. జాతీయ పతాకంతో ముందుకు సాగుతున్న ఈ యువకుడు, యువత పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిస్తున్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, సురక్షితమైన ప్రకృతిని అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. తన పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, వివిధ ప్రాంతాల్లో స్థానికులు ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని దేశమంతటా విస్తరించడమే తన యాత్ర ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

26-5-26 rakshana main_Layout 1 6/13/2026 12:31 AM Page 3



# అంతర్జాతీయ క్రికెట్‌కు కేన్ విలియమ్సన్ వీడ్కోలు!

న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ బ్యాటర్, మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు తక్షణమే వర్తించేలా రిటైర్మెంట్ ప్రకటించాడు. తన 16 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 378 మ్యాచ్‌లు ఆడిన కేన్.. 48 సెంచరీలతో 19,346 పరుగులు సాధించాడు. అతడి సారథ్యంలోనే న్యూజిలాండ్ 2021లో తొలి ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ గదను ముద్దాడింది. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్ మధ్యలోనే ఈ 35 ఏళ్ల క్లాసిక్ ప్లేయర్ వీడ్కోలు పలకడం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది.న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. 35 ఏళ్ల కేన్ విలియమ్సన్.. న్యూజిలాండ్ తరఫున 110 టెస్టులు, 175 వన్డేలు, 93 టీ20లు ఆడాడు. తన 16 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో 19 వేలకుపైగా పరుగులు సాధించాడు. ఇందులో 48 సెంచరీలు, ఆరు డబుల్ సెంచరీలు ఉన్నాయి. కివీస్ తరఫున అత్యుత్తమ క్రికెటర్‌గా పేరు పొందిన విలియమ్సన్ అన్ని పార్మాట్లకు గుడ్‌బై చెప్పినట్లు న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు శుక్రవారం (జూన్ 12, 2026) అధికారిక ప్రకటన విడుదల చేసింది. 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన కేన్ విలియమన్స్ గతేడాది అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. తాజాగా వన్డే, టెస్ట్ ఫార్మాట్‌లకు సైతం వీడ్కోలు పలికాడు. “రిటైర్మెంట్ గురించి కొంతకాలంగా ఆలోచిస్తున్నా. అయితే నా వీడ్కోలుకు ఇదే సరైన సమయం అనిపించింది. 16 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో మధురానుభూతులు ఉన్నాయి. కివీస్‌కు ఐసీసీ మేజర్ టోర్నీ లేదనే భావన మాలో బలంగా ఉండిపోయింది. కానీ 2021లో ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడం ద్వారా మా ఖాతాలోనూ ఒక ఐసీసీ టైటిల్ వచ్చి చేరినట్లయింది. న్యూజిలాండ్ తరఫున అంతర్జాతీయ క్రికెట్ ఆడడం నా అదృష్టంగా భావిస్తున్నా. అన్నీ ఆలోచించే రిటైర్మెంట్‌పై నిర్ణయం తీసుకున్నా” అని కేన్ విలియమ్సన్ తన రిటైర్మెంట్ ప్రకటనలో రాసుకొచ్చాడు. కాగా కేన్ విలియమ్సన్ ఆటగాడిగా మాత్రమే కాకుండా సారథిగా కూడా తనదైన ముద్ర వేశాడు. 2016 నుంచి 2024 వరకు అంటే దాదాపు 8 ఏళ్ల పాటు న్యూజిలాండ్ జట్టుకు సారథ్యం వహించాడు. తన కెప్టెన్సీలో రెండుసార్లు ఐసీసీ వరల్డ్ కప్ ఫైనల్స్‌కు కివీస్‌ను చేర్చాడు. 2019 ప్రపంచకప్, 2021 టీ20 ప్రపంచకప్‌లో అతడు ఈ ఫీట్ సాధించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ గదను అందించాడు. ఇక కేన్ విలియమ్సన్ తన కెరీర్‌లో 110 టెస్టులాడి 9,515 పరుగులు, 175 వన్డేల్లో 7,256 పరుగులు, 93 టీ20ల్లో 2,575 పరుగులు పరుగులు చేశాడు. 40 టెస్టులు, 91 వన్డేలు, 75 టీ20ల్లో న్యూజిలాండ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా తొలి టెస్టు లార్డ్స్‌లో జరిగింది. కేన్ విలియమ్సన్ కెరీర్‌లో ఇదే చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావడం గమనార్హం.




## భారత అండర్-19 టీంలోకి జూనియర్ ద్రావిడ్

ఇండియన్ క్రికెట్‌లో లెజెండ్ క్రికెటర్ల లిస్టులో ఉన్న టీమ్ ఇండియా స్టార్ బ్యాట్స్‌మెన్, ‘ది వాల్’ రాహుల్ ద్రవిడ్ తన క్రికెట్ ఆటను తిరిగి ప్రారంభిస్తుండగానే అతని ఇద్దరు కుమారులు అన్వయ్, సమిత్ కూడా క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నారు. ఇది ఒక విధంగా ద్రవిడ్ కుటుంబానికి శుభవార్తనే చెప్పాలి. రాహుల్ ద్రావిడ్ పెద్ద కుమారుడు సమిత్ తర్వాత ఇప్పుడు అతని చిన్న కుమారుడు అన్వయ్ కూడా తండ్రి అడుగుజాడల్లో నడిచాడు. తండ్రిలాగే ఈ లిటిల్ స్టార్ క్రికెటర్ కూడా వికెట్ కీపర్-బ్యాటర్ బాధ్యతను స్వీకరించాడు. మైదానంలో తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాడు.రాబోయే శ్రీలంక పర్యటన కోసం బీసీసీఐ జూనియర్ క్రికెట్ కమిటీ అండర్-19 జట్టును ప్రకటించింది. జూలై 4 నుంచి ప్రారంభమయ్యే శ్రీలంక పర్యటనకు భారత అండర్-19 జట్టులో అన్వయ్ ద్రవిడ్ ఎంపికయ్యాడు. ఇది ఒకరకంగా ద్రావిడ్‌కి చాలా గర్వకారణమైన విషయమనే చెప్పాలి. రాహుల్ ద్రవిడ్ పెద్ద కుమారుడు సమిత్ ద్రవిడ్ ఫాస్ట్ బౌలింగ్ ఆల్-రౌండర్ కాగా అతని చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ వికెట్ కీపర్-బ్యాటర్. అన్వయ్ భారత అండర్-19 జట్టుకు ఎంపికైన తర్వాత వీరిద్దరూ భారత అండర్-19 జట్లకు ఎంపికయ్యారు. ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో




గాయం కారణంగా 2024లో అవకాశం కోల్పోయిన సమిత్ స్థానంలో ఇప్పుడు శ్రీలంకతో వన్డే సిరీస్ కోసం భారత అండర్-19 జట్టుకు అన్వే ద్రవిడ్ ఎంపికయ్యాడు. తన తండ్రిలాగే ఇతను కూడా వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్‌గా ఆడతాడు. 17 ఏళ్ల అన్వయ్ ద్రవిడ్ గత వినూ మంకడ్ ట్రోఫీలో కర్ణాటక అండర్-19 జట్టును క్వార్టర్ ఫైనల్స్‌కు నడిపించాడు. ఈ టోర్నమెంట్‌లో అతను ఆరు మ్యాచ్‌లలో మొత్తం 220 పరుగులు చేయగా, అతని అత్యధిక స్కోరు 82 నాటౌట్. శ్రీలంక పర్యటనకు అండర్-19 జట్టు - యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ (కెప్టెన్), సాగర్ విర్క్, లక్ష్య రాయచందానీ (వైస్ కెప్టెన్), వినీత్ వికె, అర్జున్ రాజ్‌పుత్, కుషాగ్రా ఓజా, రజత్ బఘేల్ (వికెట్ కీపర్), అన్వయ్ ద్రవిడ్ (వికెట్ కీపర్), అన్‌మోల్‌జీత్, విపత్రేషుద్‌కుద్, యాష్‌ల్‌జీత్ సింగ్, వి. గౌడ్, వి. మోహిత్ ఉల్వా, ఇషాన్ సూద్.అయితే రాహుల్ ద్రావిడ్ క్రికెట్ ప్రపంచంలో ఉండగానే తన ఇద్దరు కొడుకులు భారత జూనియర్ జట్టులో చోటు సంపాదించడం పట్ల వాల్ ఫ్యాన్స్ కూడా గర్వంగా ఫీలవుతున్నారు. క్రికెట్ రంగంలో ద్రావిడ్ లెగసీని కంటిన్యూ చేస్తున్నారు అని సంబరపడిపోతున్నారు.

## అత్యంత బిజీ ఫాస్ట్ బౌలర్‌గా సిరాజ్




మహమ్మద్ సిరాజ్ .. పరిచయం అక్కర్లేని పేరు. హైదరాబాద్ గల్లీ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఈ పేసర్.. ఇప్పుడు టీమిండియాకు కీలకంగా మారాడు. ఒకప్పుడు బుమ్రాకు సపోర్టింగ్ రూల్‌లో మాత్రమే కనిపించిన ఇతడు.. ఇప్పుడు తనకంటూ ప్రత్యేకత సంపాదించాడు. టీమిండియా ప్రధాన పేసర్‌గా మారిపోయాడు. వైట్-బాల్ క్రికెట్‌లో ఎక్కువగా అవకాశాలు అందుకోలేకపోతున్న ఈ పేసర్.. టెస్టుల్లో మాత్రం సత్తాచాటుతున్నాడు. అంతేకాకుండా ఫిట్‌నెస్ విషయంలో ఎవరికీ అందనంతగా.. విరామం లేకుండా మ్యాచులు ఆడుతూ.. ఆదర్శనంగా నిలిస్తున్నాడు. వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్ అనే పదం తన డిక్షనరీలోనే లేదు అన్నట్లుగా దూసుకెళ్తున్నాడు. దీంతో ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత బిజీగా ఉండే ఫాస్ట్ బౌలర్‌గా మారిపోయాడు. గతంలో భారత బౌలర్లకు వరుసగా క్రికెట్ మ్యాచులు ఆడేవారు. ఆప్షన్లు తక్కువగా ఉండటంతో కపిల్ దేవ్ లాంటి ప్లేయర్ విరామం లేకుండా మ్యాచ్‌లు ఆడేవాడు. ఆ తర్వాత జహీర్ ఖాన్, ఇషాంత్ శర్మ కూడా ఇలాంటి క్రికెటే ఆడారు. కానీ బుమ్రా రాకతో పరిస్థితి మారిపోయింది. అతడి ప్రదర్శన దృష్ట్యా.. బీసీసీఐ అతడిపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. పనిభారం దృష్ట్యా పరిమిత సంఖ్యలోనే అతడిని మ్యాచ్‌లు ఆడిస్తూ వస్తోంది. దీంతో బుమ్రా గైర్హాజరీలో పేస్ దళాన్ని నడిపించే వ్యక్తి జట్టుకు అవసరమయ్యాడు. అలాంటి సమయంలో నేనున్నా అంటూ ముందుకొచ్చాడు సిరాజ్. అప్పటి నుంచి బిజీగా మారిపోయాడు. 2023 జనవరి నుంచి సిరాజ్ టెస్టులు, వన్డేలు, టీ20లు, ఐపీఎల్‌లో కలిపి 1,231 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఈ వ్యవధిలో ఇన్ని ఓవర్లు వేసిన ఏకైక ఫాస్ట్ బౌలర్ అతడే. ముఖ్యంగా సిరాజ్ టెస్టుల్లో కీలక పేసర్‌గా మారిపోయాడు. ఏకంగా 30 మ్యాచ్‌లలో 744 ఓవర్లు వేశాడు. అంటే దాదాపు ప్రతి టెస్టులో 25 ఓవర్లు వేశాడన్నమాట. మరో మాటలో చెప్పాలంటే, ఫాస్ట్ బౌలర్లపై అత్యధిక శారీరక శ్రమను పెట్టే ఫార్మాట్‌లోనే సిరాజ్ మొత్తం పనిభారంలో 60 శాతం ఉంది. అందుకే వైట్ బాల్ క్రికెట్‌లో సిరాజ్ అవసరం లేదనిపిస్తున్నా.. రెడ్ బాల్ క్రికెట్‌లో మాత్రం తప్పనిసరిగా ఎంపిక చేయాల్సిన పరిస్థితి కల్పించాడు. 2023 నుంచి భారత్ 33 టెస్టులు ఆడగా, సిరాజ్ వాటిలో 30 టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించాడు. ఇదే సమయంలో బుమ్రా.. కేవలం మూడింట రెండు వంతుల టెస్టులు ఆడాడు. 2025లో భారత్ ఇంగ్లాండ్‌లో పర్యటించినప్పుడు, సిరాజ్ ఐదు టెస్టుల్లోనూ ఆడిన ఏకైక భారత సీమర్‌గా నిలిచాడు. 185 ఓవర్లు బౌలింగ్ చేసి జట్టు తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ముందున్న కఠిన సీజన్, వన్డే ప్రపంచకప్, టెస్టుల్లో సిరాజ్ అవసరాన్ని గుర్తించే సెలక్టర్లు ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20ల నుంచి సిరాజ్‌కు విశ్రాంతి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌లో భారత్ 17 వన్డేలు, 10 టెస్టులు ఆడాల్సి ఉంది. వన్డే ప్రపంచకప్ 2027 దృష్ట్యా.. బీసీసీఐ బుమ్రాతో పాటు.. సిరాజ్ పనిభారాన్ని కూడా ఇకపై పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం సిరాజ్ ఫిట్‌గా ఉన్నాడు, పనిభారం అనే పదం అతడికి అవసరం లేదు. కానీ సిరాజ్ మ్యాచ్ ఆడని పరిస్థితి తలెత్తకూడదనే ఉద్దేశంలో సెలక్టర్లు ఆచీతూచీ అడుగులు వేస్తున్నారు!

## ప్రొఫెషనల్ మేనేజర్లకు దూరంగా ఉండు వైభవ్

టీమిండియా మాజీ క్రికెటర్ ఎస్ శ్రీశాంత్ హెచ్చరిక

ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చిన టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. 15 ఏళ్ల వయసులోనే ఈ బిహార్ కుర్రాడు వరల్డ్ రికార్డ్స్ నమోదు చేశాడు. తనకే నమోదైన విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత క్రికెట్ ముఖచిత్రంగా మారాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో వైభవ్ (776) అవార్డుల మోత మోగించాడు. ఆరెంజ్ క్యాప్‌తో పాటు మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్, ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్, సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్, అత్యధిక సిక్సర్ల అవార్డులను సొంతం చేసుకున్నాడు. ఈ ప్రదర్శనతో టీమిండియా పిలుపు కూడా అందుకున్నాడు. జూన్ 26 నుంచి ఐర్లాండ్‌తో జరిగే రెండు టీ20ల సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం చేసే అవకాశం ఉంది. అతని బ్యాటింగ్, ప్రతిభపై ఎలాంటి సందేహం లేదు. అయితే వైభవ్ సూర్యవంశీని టీమిండియా మాజీ క్రికెటర్ ఎస్ శ్రీశాంత్ హెచ్చరించాడు.ప్రొఫెషనల్ మేనేజర్లకు దూరంగా ఉండాలని, ఆర్థిక వ్యవహారాలను పూర్తిగా తల్లిదండ్రులకు అప్పగించాలని సూచించాడు. చిన్నవయసులోనే సక్సెస్ అందుకున్న వైభవ్ సూర్యవంశీని జాగ్రత్తగా చూసుకోవాలని అతని తండ్రి సంజీ సూర్యవంశీని శ్రీశాంత్ ప్రత్యేకంగా కోరాడు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వైభవ్ సూర్యవంశీ కేవలం క్రికెట్‌పై మాత్రం దృష్టిపెట్టాలని శ్రీశాంత్ సలహా ఇచ్చాడు. ‘వైభవ్.. నువ్వు ఈ ఇంటర్వ్యూ చూస్తే.. ఇదే నా అభ్యర్థన. ఈ మేనేజర్లను పక్కనపెట్టి నీ క్రికెట్‌పై మాత్రమే దృష్టి పెట్టు. నీ తండ్రి, కుటుంబం అన్నీ చూసుకుంటారు. ప్రొఫెషనల్ మేనేజర్లకు దూరంగా ఉండు. వైభవ్ బ్యాటింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అతను యువ ఆటగాళ్లకు, క్రికెట్‌లో రాణించాలని కలలు కనే ప్రతీ ఒక్కరికి ఆదర్శప్రాయుడు. సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ అడుగుజాడల్లో వైభవ్ సూర్యవంశీ చూపిన అంకిత భావం అపారమైనది. కరోనా సమయంలో కూడా వైభవ్ సూర్యవంశీ ఇంటిపై కఠోరంగా ప్రాక్టీస్ చేస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. అతని తండ్రికి, కోచ్‌లకు నా సెల్యూట్. అవకాశం గురించి ఆలోచించకుండా.. వైభవ్‌ను ప్రోత్సహించారు. వైభవ్ కూడా రోజు నాలుగు గంటలు ప్రయాణించి.. రోజూ 750 నుంచి 1000 బంతులను ఎదుర్కొంటూ శ్రద్ధగా ప్రాక్టీస్ చేశాడు. అతనికి బ్రేక్ తీసుకోవాలనే కోరిక కూడా కలగలేదు. అతన్ని అలా చూడటం అద్భుతంగా అనిపించింది.’అని శ్రీశాంత్ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ ఎండార్స్‌మెంట్ వ్యవహారాలను రాజస్థాన్ రాయల్స్ చూసుకుంటుంది. వైభవ్, అతని కుటుంబానికి క్రీడా ప్రపంచంలోని వ్యాపార రంగం కొత్త కావడంతోనే శ్రీశాంత్ హెచ్చరికకు ప్రాధాన్యత సంతరించుకుంది.

## సచిన్ రికార్డు బద్దలు కొట్టిన వైభవ్

ఇండియా క్రికెట్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ పేరే వినిపిస్తోంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టి20 టూర్‌కు సెలెక్ట్ అయి ఆల్రెడీ సచిన్ టెండూల్కర్ రికార్డును బ్రేక్ చేసిన ఈ యంగ్ సెన్సేషన్ సీనియర్ టీమ్ డెబ్యూ కోసం ఫ్యాన్స్ ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇతను శ్రీలంకలో ఇండియా ఏ టీమ్ తరఫున ట్రయాంగులర్ సిరీస్ ఆడుతున్నాడు. అయితే ఈ నెల చివర్లో జరగబోయే ఐర్లాండ్ సిరీస్‌కు అక్కడ జరుగుతున్న కమ్యూనిటీ అల్లర్లు, గొడవలు ఒక పెద్ద థ్రెట్‌గా మారాయి. ఐర్లాండ్‌లో పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో లిస్‌బర్న్‌లో జరగాల్సిన ఇంటర్-ప్రొవిన్షియల్ టి20 ఫెస్టివల్‌ను ఇప్పటికే క్యాన్సిల్ చేశారు. ఈ ఆదివారం జరగబోయే ఐరిష్ సీనియర్ కప్, నేషనల్ కప్ మ్యాచ్‌ల నిర్వహణపై రాబోయే 48 గంటల్లో డెసిషన్ తీసుకుంటామని క్రికెట్ ఐర్లాండ్ బోర్డు తెలిపింది. ప్లేయర్స్, కోచ్‌లు, సపోర్టర్ల సేఫ్టీ తమకు అత్యంత ముఖ్యమని, లోకల్ అథారిటీస్‌తో నిరంతరం కాంటాక్ట్‌లో ఉన్నామని బోర్డు చెప్పింది. ఒకవేళ అక్కడ పరిస్థితులు కంట్రోల్‌లోకి రాకపోతే




ఇండియా, ఐర్లాండ్ సిరీస్ కూడా రద్దయ్యే ప్రమాదం ఉంది. ఈ ఇష్యూను బీసీసీఐ కూడా క్లోజ్‌గా మానిటర్ చేస్తోందని, బెల్‌ఫాస్ట్‌లో గొడవలు తగ్గకపోతే మ్యాచ్‌లను వేరే వెన్యూకు షిఫ్ట్ చేసే ఛాన్స్ ఉందని సమాచారం. ఐపిఎల్ 2026 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతూ సిక్సర్ల వర్షం కురిపించిన వైభవ్ సూర్యవంశీ, ఇప్పుడు ఇండియా ఏ టీమ్ తరఫున వన్డే ఫార్మాట్‌లో మాత్రం క్లాస్ అప్రోచ్ చూపిస్తున్నాడు. గురువారం ఆఫ్ఘనిస్తాన్ ఏ టీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ 22 బంతుల్లో 44 రన్స్ చేసి అవుట్ అయ్యాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను ఒక్క సిక్స్ కూడా కొట్టకుండా కేవలం గ్రౌండ్ షాట్స్ ఆడటం విశేషం. ఐపిఎల్ తరహాలో కాకుండా వన్డే ఫార్మాట్‌కు తగ్గట్లు చాలా మెచ్యూర్డ్‌గా బ్యాటింగ్ చేశాడు. అయితే వైభవ్ ఒంటరి పోరాటం చేసినప్పటికీ ఈ మ్యాచ్‌లో ఇండియా ఏ జట్టు ఆఫ్ఘనిస్తాన్ ఏ చేతిలో ఓడిపోయింది. ఈ అల్లర్ల సమస్య కనుక సాల్వ్ అయితే ఐర్లాండ్ గడ్డపై వైభవ్ సూర్యవంశీ హిస్టరీ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. అతి చిన్న వయసులోనే టీమిండియా క్యాప్ అందుకోబోతున్న ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ పర్ఫార్మెన్స్ ఎలా ఉంటుందో చూడాలని మేనేజ్‌మెంట్ కూడా ఆశగా ఉంది. కోచ్ గౌతమ్ గంభీర్ కూడా ఈ యంగ్ టాలెంట్‌ను ఇంటర్నేషనల్ లెవెల్లో టెస్ట్ చేయాలని ప్లాన్ చేస్తున్నాడు.

26–5–26 rakshana main_Layout 1 6/13/2026 12:31 AM Page 4



# బాలయ్య కొత్త చిత్రం.. ఎన్బీకె 111 టీజర్



గాడ్ ఆఫ్ మాసెస్.. ఈ ట్యాగ్ కి అర్హత ఉన్న ఏకైక టాలీవుడ్ నటుడు నందమూరి నటసింహం బాలకృష్ణ మాత్రమే. అసలు మాస్ అంటే బాలయ్య.. బాలయ్య అంటే మాస్. టాలీవుడ్ మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ బాలయ్య. దాదాపు మూడు దశాబ్దాల క్రితమే మాస్ సినిమా అంటే ఎలా ఉంటుందో.. ముద్దుల మావయ్యతో మాస్ హిట్ అందుకున్న బాలయ్య, లారీ డ్రైవర్ తో మాస్ కి పూనకాలు తెప్పించి సమరసింహారెడ్డితో ట్రెండ్ సెట్టర్ మారి గాడ్ ఆఫ్ మాస్ గా మారారు. అప్పటి నుంచి బాలయ్యలోని మాస్ హీరో ఆడియెన్స్‌ను అలరిస్తునే ఉన్నాడు. దర్శకులు బాలయ్య కోసం రాసుకున్న మాస్ కథలు ఎన్నెన్నో. అయితే కొందరు హీరోలకు మాస్ అంటే ఒక లిమిట్ ఉంటుంది. మాస్ సినిమాలు ఇక చాలు బాబు అనేలా ఉంటుంది. కానీ బాలయ్య విషయంలో అలా కాదు. ఇంతకంటే మాస్ ఏం చూపిస్తారులే అనుకునేలోపే.. మాస్ కా బాప్ లాంటి సినిమా చేయడం బాలయ్య స్టైల్. సింహా, లెజెండ్, అఖండ లాంటి సినిమాల్లో బాలయ్యలోని కొత్త మాస్ హీరోని చూపించాడు బోయపాటి. మరి ఇంతకంటే మాస్ ఇంకేం ఉంటుంది అనుకుంటే.. వీరసింహారెడ్డిలో బాలయ్య చేసిన మాస్ తాండవానికి థియేటర్లు దద్దరిల్లిపోయాయి. ఇక డాకు మహారాజ్ అయితే నెక్స్ లెవల్ ఆఫ్ మాస్ మూవీ అని చెప్పడంలో ఎలాంటి డౌట్స్ అక్కర్లేదు. డేకేడ్ బెస్ట్ ఇంటర్వెల్ బ్యాంగ్ అంటే ఇప్పటికి దాకు మహారాజ్ అనే చెప్పాలి. ఇక బాలయ్య వింటేజ్ మాస్ మొత్తం చూపించారులే అనుకునే టైమ్ లో బాలయ్య మాస్ దాహం మాత్రం ఇప్పట్లో తీరేది కాదని సరికొత్త మాస్ ని పరిచయం చేసాడు దర్శకుడు గోపీచంద్ మలినేని. లేటెస్ట్‌గా వచ్చిన ఎన్బీకె 111 టీజర్ చూస్తే.. ఈ విషయం అర్థమవుతుంది. ఈసారి వింటేజ్ బాలయ్యను కాకుండా.. న్యూ ఏజ్ బాలయ్యను చూపించాడు. ఈ టీజర్ చూస్తే.. స్టైలిష్ లుక్‌తో బాలకృష్ణ మాస్‌ను 'జెన్–జీ' ట్రెండ్‌కు తగ్గట్టుగా ప్రెజెంట్ చేయబోతున్నాడు గోపీచంద్. దానికి తోడు.. బాలయ్య అంటే ఊగిపోయే తమన్, మరోసారి తన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో పూనకాలు తెప్పించాడు. ఏదేమైనా.. గాడ్ ఆఫ్ మాసెస్ అంటే ఆ మాత్రం ఉంటది మరి!

## లేస్ డ్రస్‌లో దివి మ్యాజిక్...

తెలుగు టాప్ రియాలిటీ షో 'బిగ్ బాస్' ద్వారా ప్రేక్షకుల మనసు దోచుకున్న అందాల భామ దివి వాద్య. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తాజాగా షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు ఇప్పుడు నెట్టింట మంటలు పుట్టిస్తున్నాయి. డస్టీ పింక్ కలర్ లేస్ డ్రెస్‌లో దివి ఇచ్చిన హాట్ అండ్ క్యూట్ పోజులు అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి. "కేవలం నీ గురించే ఆలోచిస్తున్నా!" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. దివి వాద్య తాజా ఫోటోషూట్‌లో సరికొత్త లుక్‌తో మెరిసిపోయింది. దట్టమైన పచ్చని చెట్ల మధ్య, ప్రకృతి ఒడిలో ఆమె దిగిన క్లోజప్ పోర్ట్రెయిట్ ఫోటోలు అద్భుతంగా ఉన్నాయి. ముఖ్యంగా ఆమె సాఫ్ట్ అండ్ ఇంటెన్స్ కంటిచూపు, ఆ గ్లామరస్ ఎక్స్‌ప్రెషన్స్ చూసేవారిని మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఇక ఈ ఫోటోల్లో దివి కాన్ఫిడెన్స్, నేచురల్ బ్యూటీ స్పష్టంగా కనిపిస్తూ నెటిజన్లను ఆకర్షిస్తున్నాయి.ఈ స్పెషల్ షూట్ కోసం దివి డిజైనర్ డ్రెస్‌ను ఎంచుకుంది. 'ఇక డస్టీ పింక్ కలర్ లేస్ హాల్టర్-నెక్ టాప్‌లో ఆమె ఎంతో అందం గా కనిపిస్తోంది. ప్రముఖ ఫొటోగ్రాఫర్ హైందవి తన కెమెరా నైపుణ్యంతో దివి అందాన్ని మరింత అందంగా స్క్రీన్‌పై ఆవిష్కరించారు. ఇక ట్రెండీ అవుట్‌ఫిట్, పర్‌ఫెక్ట్ లైటింగ్ కలసి ఈ ఫోటోషూట్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి.





## కళ్ళు చెదిరే గెటప్‌లో ఐశ్వర్య లేటెస్ట్ లుక్!

స్వర్గీయ నటులు రాజేష్ కూతురుగా సినీ ఇండస్ట్రీ లోకి చైల్డ్ ఆర్టిస్ట్ గా అడుగుపెట్టింది ఐశ్వర్య రాజేష్. ముద్దు ముద్దు మాటలతో రాజేంద్రప్రసాద్ రాంబంటు సినిమాలో తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె.. తమిళంలో ఎక్కువగా సినిమాలు చేస్తూ హీరోయిన్గా స్థిరపడింది. ఇక తెలుగులో మళ్ళీ అదే రాజేంద్రప్రసాద్ లీడ్ రోల్ పోషించిన కౌసల్య కృష్ణమూర్తి సినిమా ద్వారా నటిగా తెలుగు తెరకు పరిచయమైన ఈమె..ఆ తర్వాత వరల్డ్ ఫేమస్ లవర్ , టక్ జగదీష్ అంటూ పలు చిత్రాలు చేసి తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఇకపోతే ప్రస్తుతం ఈమె పలు భాషా చిత్రాలలో నటిస్తూ బిజీగా ఉన్నప్పటికీ.. మరొకవైపు సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. వాస్తవానికి ఐశ్వర్య రాజేష్ నటిగానే కాకుండా తనకంటూ ప్రత్యేకమైన ఫ్యాషన్ సెన్స్ ను కూడా కలిగి ఉంది. ట్రెడిషనల్ డ్రెస్ ల నుండి వెస్టన్ స్టైల్ వరకు అన్నింటిలో కూడా తనదైన శైలిని ప్రదర్శిస్తూ అందరి దృష్టిని ఆకట్టుకుంటున్న ఐశ్వర్య ఒకవైపు సాంప్రదాయంగా పట్టు చీరలు, అందమైన లెహంగాలు, మోడ్రన్ డిజైనర్ శారీలలో ఆకర్షణీయంగా కనిపిస్తూ.. ట్రెడిషనల్ వేర్ లో కూడా పర్ఫెక్ట్ నిరూపించుకుంటోంది. సాంప్రదాయంగానే కాదు బోర్డ్ రూమ్ మీటింగ్స్ లేదా రెడ్ కార్పెట్ ఈవెంట్ల కోసం తరచుగా మెరూన్ లేదా ఇతర డార్క్ కలర్ వెస్ట్ కోట్ అండ్ బ్రౌజర్ సెట్లను ధరిస్తూ ప్రేక్షకులను మెస్మరైజ్ చేసే ఈమె తాజాగా మరో ఔట్ఫిట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

## ఇరుముడితో అదృష్టం వెతుక్కుంటున్న భవానీ శంకర్

న్యూస్ ప్రజెంటర్ నుండి హీరోయిన్‌గా ఛేంజైన చెన్నై పొన్ను ప్రియా భవానీ శంకర్ అనతికాలంలోనే యా÷–టక్రెస్‌గా ఐడెంటిటీని దక్కించుకుంది. సపోర్టింగ్ రోల్స్ చేసుకుంటూ.. సెల్ఫ్ మేడ్ హీరోయిన్‌గా మేకోవర్ అయ్యింది. కోలీవుడ్‌లో ప్రూవ్ చేసుకున్న ఈ బ్యూటీ.. టాలీవుడ్‌లో మాత్రం సక్సెస్ కోసం స్ట్రగుల్ ఫేస్ చేస్తోంది. తెలుగులో ఇప్పటి వరకు చేసిన త్రీ మూవీస్ ప్లాప్సే. సంతోష్ శోభన్ హీరోగా తెరకెక్కిన కళ్యాణం కమనీయంతో టాలీవుడ్ తెరంగేట్రం చేసింది ప్రియా భవానీ శంకర్. కానీ ఈ సినిమా వచ్చి పోయిన విషయం తెలియదు ఆడియన్స్‌కు. కానీ దూత వెబ్ సిరీతో చేరువైంది. ఇందులో నాగ చైతన్య భార్యగా కరెప్టెడ్ జర్నలిస్ట్‌గా నటించింది. ఈ సిరీస్.. గోపీచంద్‌తో భీమ, సత్య దేవ్ జీబ్రాలో నటించే తెచ్చిపెట్టింది కానీ, ఈరెండు బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడటంతో టీటౌన్‌లో అవకాశాలు తగ్గాయి. కోలీవుడ్ ఆఫర్స్‌తో కాలం నెట్టుకొస్తున్న ప్రియాకు.. మరొక ఛాన్స్ ఇస్తోంది టాలీవుడ్ . శివ నిర్వాణ- రవితేజ కాంబోలో తెరకెక్కుతోన్న ఇరుముడిలో నటిస్తోంది. రవితేజకు భార్యగా కావేరి పాత్రలో కనిపించబోతుంది. ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఫిల్మ్. షూటింగ్ కంప్లీట్ కావడంతో సెట్స్‌లోని పిక్స్ సోషల్ మీడియాలో పంచుకుంది ప్రియ. అలాగే దూత సీక్వెల్‌లోనూ కంటిన్యూ కాబోతుంది. రీసెంట్లీ ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ప్రియా ఎ÷–లాప్స్ పట్టించుకోకుండా టాలీవుడ్ ఆఫర్స్ ఇస్తోంది.. మరీ మేడమ్ వాటిని సద్వినియోగం చేసుకుంటుందో లేదో.



Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District